
అరుణాదేవి

పిటేతో పేరమెత మెవుతోంది. తను కాలే జికి వెళ్తూ తల్లిగది తాళంవేస్తుంది. చిన్నబాబు, అక్కయింట్లో లేనప్పుడు తల్లిని, చిన్నపిల్లల్ని జాగ్రత్తగా చూస్తుంటాడు.

ఆరోజు మంజుల చివరిపరీక్ష వ్రాసి ఇంటికి వచ్చింది. ఏదో పెద్దబరువు తలమీదమండి దింపినట్లుగా 'ఫీ'లయింది. "ఇంక రిజల్ట్సు ఎలా వచ్చినా ఫర్వాలేదు. నా పని నేను పూర్తి చేసుకుంటాను.' అను కుంటూ లోపలికివచ్చిన మంజులకి చిట్టి చెల్లాయి రాణి ఒకకవరు అందించి తోట లోనికి పరుగు దీసింది, ఆడుకునేందుకు. ఒక్క క్షణం రాణికేసి చూసింది ... 'నేనూ అంత చిన్నపిల్లగా మారగలిగితే ఎంత హాయి' అనుకుంటూ మరుక్షణంలో తన ఊహలకు నవ్వుకుంటూ ఉత్తరం విప్పింది.

'అక్కా !

ఇవాళతో నీ పరీక్షలు అయిపోయా యనుకుంటాను. నీకు నా మీద చాలా కోపం వచ్చిందా, అక్కా? నువ్వొక్క దానివీ అంత కష్టపడుతుంటే ఎంతబాధగా ఉండేదో తెలుసా ? మరెందుకు నాకు సాయం చేయకుండా పారిపోయావు అంటావు కదూ ? అక్కా ! నేను చెప్పేది ఏమి టంటే నీవుమాత్రం ఎందుకు అంత కష్టపడాలి, అని. అన్నయ్యకూడా చాలా బాధపడ్డాడు. ఆరోగ్యం పాడుచేసు కుంటోంది అని. ఆఁ! అక్కా! వదిన

# పరిష్కారం

పేరు జయలక్ష్మి కదా. అలా ఆపేరు మోటుగా ఉందని జయశ్రీ అని మార్చు కుంది. వదినదగ్గర ఎన్ని నైలెక్స్ జరీ పూల చీరెలున్నాయో తెలుసా ? తాను చాలా 'నీట్'గా డ్రెస్' అవుతుంది. నాకూ నేర్పించిందిలే. రోజూ లిప్‌స్టిక్ వేస్తుంది అక్కా ! నీ వేమో, నేనొకసారి నెయిల్ పాలిష్ కొంటేనే ఎన్నో చీవాట్లేశావు. నీకు గుర్తుందా ?

వదినా మరో 30 మంది ఆడవాళ్లు కలిపి క్లబ్ ఏర్పాటు చేసుకున్నారు. అందరూ ధనవంతులే. ఆ క్లబ్‌లో నేను కూడా 'మెంబర్'ని అయ్యాను. సాయం త్రము 6—8½ దాకా క్లబ్బులో ఉంటాం. ఇంటికి వచ్చేసరికి 9—15 అవుతుంది.

వదినకి నేనంటే చాలా ఇష్టం అక్కా ! 'పదిహేడేళ్లకే 5'3' ఉన్నా వంటే ఇంకా ముందుముందు ఎంత పొడుగు అవుతావో. పొడుక్కుతగ్గ 'ఫిగర్' ఉంది కాబట్టి ఏ 'డ్రెస్' అయినా 'మాచ్' అవుతుంది.' అని వదిన నాకు పంజాబీడ్రెస్‌లు, స్కర్ట్—బ్లౌస్, జీన్స్ కుట్టించింది. వోణీలు బాగాలేవని బొంబాయి వెళ్లిన మర్నాడే మానేశాను. నేను వెళ్లి నెల అయిందికదూ ! చాలా హాయిగా ఉందక్కా ! అక్కా ! నువ్వుకూడా అక్కడ ఉండొద్దు. నువ్వూ బొంబేకి వచ్చెయ్యి.

ఏం అక్కా ! సరదాగా ! 'షికార్లు ఎంజాయ్' చెయ్యాలంటే అక్కడ ఏం వీలౌతుందక్కా ! పలుగురమ్మాయిలు కలిపి కారులో పిక్చర్‌కి వెళ్తే అందరూ విరగబడి చూస్తారు. డర్టీ పూరు! అక్కా ! అన్నయ్యకూడా నిన్ను రమ్మని వ్రాయమన్నాడు. అన్నయ్య బాబుపేరు 'రాజ్‌కుమార్' అచ్చు రాజకుమారుడు లాగే ఉంటాడు—తెల్లగా, లావుగా...అబ్బ! తెగముద్దొస్తాడు. వాడికి 6 నెలలు కాని చూసేందుకు సం॥ పిల్లాడిలా ఉంటాడు. వాడిపేరు తమాషా అక్కా! వదినకి రాజేంద్రకుమార్ యిష్టంట. అన్నయ్యకి రాజశ్రీ అంటే యిష్టంకదా. అంచేత యిద్దరి పేర్లూ కలిపి పెట్టారు. వదిన 'కుమార్' అంటే అన్నయ్య 'రాజ్' అంటాడు. నవ్వొస్తుందికదూ ! వాడిని చూసేందుకు ఒక 'ఎడ్యుకేటెడ్ ఆయా' ఉంది. ఆమెని చూస్తే ఎవరూ 'ఆయా' అనుకోలేరు. అక్కా ! వాడు అంత ముద్దొచ్చినా వదిన ఎప్పుడూ ఎత్తుకోదు. నన్నూ ఎత్తుకోవద్దు అంటుంది. వాడిని ఆయాయే చూసుకుంటుంది.


అక్కా ; నువ్వూ పిల్లల్ని చూసేం దుకు ఒక ఆయాని, అమ్మకి ఒక ఆయాని, వంటకి వంటమనిషిని, ఇల్లు చూసేందుకు ఒక 'హౌస్ కీపర్'ను పెట్టేసి హాయిగా ఉండరాదూ. ఇన్ని పనులు, చదువు అన్నీ సాగాలంటే ఒక్క దానివి నీకుమాత్రం వీలవుతుందా ?

వదిన ఎంత చక్కగా కబుర్లు చెబు తుందో తెలుసా ! ఎంత మొహమాటస్తులు కూడా తన దగ్గర కొత్తగా 'ఫీల'వరు. అంత చక్కగా కబుర్లు చెప్పటం, రియల్లీ ఇటీసెగిఫ్ట్ కదక్కా !

అక్కా! చాలా రాశానుకదూ? మన వి. వాడ లైఫ్‌ని దీంతో 'కంపేర్' చేసి చూడు. డబ్బున్నా అనుభవించటం చేత కావాలక్కా. నీ 'హెల్త్'ని, నీ 'ఛార్మ్'ని ఎందుకు 'వేస్ట్' చేసుకుంటావు. ఇలా రాస్తే నీకు కోపంకదూ.

అమ్మ అలాగే ఉందా ? తనని నా మదర్' అనాలంటే సిగ్గుగా ఉంది. హాస్పిటల్‌లో 'జాయన్' చెయ్యకూడదా అక్కా.

ఓ. కే. బొమ్మడే 4½ అయింది, ఇంక



'[illegible]' [illegible] [illegible]
[illegible] అవకాశం.

[illegible] మామ్,

యువర్స్ లవింగ్ సిస్టర్
శ్యామా''

ఉత్తరం చదివి భారంగా నిట్టూర్చింది మంజుల. 'దీనికప్పుడే యీ 'పిటీ లైఫ్' పిచ్చులన్నీ తలకెక్కాయి. ఆవిడ వొక్కసారైనా కొడుకు నెత్తుకోదట. అదొక గొప్పకాబోలు. లేదా చీరె పొగను వెడుతుందని భయం కాబోలు. శ్యామల! వింత మారిపోయింది? పిచ్చిదైనంత మాత్రాన అమ్మ అమ్మ కాకపోతుందా.' బాధగా ఉత్తరాన్ని బల్లమీద పడేసి లేచి లోపలికి వెళ్ళింది.

* * *

స్నానంచేసి బట్టలు మార్చుకుని, బొట్టుపెట్టుకుని జడ అల్లుకుంటూ వంటగదిలో ప్రవేశించి మంజుల. వంటగది ఎదురుగా ఉండేగదిలోనే సువర్చలమ్మ... మంజుల తల్లి...ఉంటుంది. వంటచేస్తున్న మంజుల, 'ధన్' అన్న చప్పుడు విని గభుక్కున స్టౌ ఆర్పేసి, లేచి తల్లి గదిలోకి వెళ్ళింది. ఆమె వాంతి చేసుకుని, నిస్త్రాణగా పడుంది.

పడిపోయిన తల్లిని లేవదీసి, మొహం కడిగి బట్టలుమార్చి, మంచంమీది పక్క పర్చి దానిపైన పడుకోబెట్టి, గది శుభ్రం చేసి డాక్టరుకు ఫోన్‌చేసి నీరసంగా వంటగదిలోకి నడిచింది మంజుల—' 'అమ్మకి మళ్ళీ...' అనుకుంటూ.

* * *

'డాక్టర్! మా అమ్మకు ఏమీ ప్రమాదం లేదుకదా?' ఆదుర్దాగా అడిగింది మంజుల, తల్లిని పరీక్షిస్తున్న లేడీడాక్టర్ లలితాదేవిని 'ఇలారా! మంజులా! నీతో మాట్లాడాలి.' గంభీరంగా, అన్న డాక్టర్ కేసి అయోమయంగా చూస్తూ తన గదిలోనికి తీసికెళ్ళింది. సోఫాలో కూర్చున్నాక—

'నీ వయస్సెంత?' అనడిగింది లలితాదేవి. మంజుల తెల్లబోయింది. మాట్లాడాలని ప్రత్యేకంగా పిలిచి యిదేం ప్రశ్న?

'ఇరవైరెండు'

'మీ మదర్‌కూ యింతవరకూ మీరెంతమంది పిల్లలు?'

అంతవరకూ డాక్టర్ మొహంలోకే తదేకంగా చూస్తున్న మంజుల చటుక్కున తలదించుకుని, కళ్ళువాల్చుకుంది.

# పరిష్కారం

'...................'

'చెప్పమ్మా! నేను హాస్యానికి అడగటం లేదు.'

'మొత్తం పదిహేడుమంది. అందులో ముగ్గురు డెలివరీ టైంలోను, ఏడాది లోపుగాను పోయారు. మా అక్కయ్యలు నలుగురికి నేను పి. యు. సి.కి కూడా రాక ముందే వివాహాలు అయ్యాయి. మా పెద్దన్నయ్యకొడుకు మా పెద్ద తమ్ముడు చిన్నబాబు వయస్సువాడు.' మంజుల కళ్ళలో అవమానం, సిగ్గు, ప్రతిఫలిస్తున్నాయి. డాక్టర్ సానునయంగా ఆమె భుజాన్ని తట్టింది.

'మా రెండో అన్నయ్యకి రెండేళ్ళ క్రితం పెళ్ళయింది. బొంబాయిలో ఉంటున్నాడు. ఆ తర్వాత ఒకన్నయ్య పురిట్లోనే పోయాడు. ఆ తర్వాత నేను. నా తర్వాత యిద్దరు అమ్మాయిలు పుట్టి పోయాక శ్యామల. తర్వాత చిన్నబాబు అంటే కృష్ణ, తర్వాత గీత, నెక్స్టు రమేష్, ఆ తర్వాత ఒక అబార్షన్ అయింది. తరువాత రాణి, రాణి తర్వాత కూడా రెండు అబార్షన్లయ్యాయి. ఇప్పుడు మళ్ళీ......' వాక్యం పూర్తిచెయ్యలేక ఒక్కక్షణం ఊరుకుంది'

'కృష్ణ పుట్టినప్పుడే అమ్మకి ఈ జబ్బు మొదలైంది. పిచ్చికాబట్టి ఆపరేషన్ చెయ్యాలి. లేకుంటే పుట్టబోయే పిల్లలకి కూడా పిచ్చి రావచ్చును అని స్పెషలిస్టు చెప్పారు డాక్టర్! మళ్ళీ......' తలదించుకుంది మంజుల. కొద్దిసేపు డాక్టర్ కూడా మౌనంగా ఉండిపోయింది. 'డాక్టర్' అని మంజుల పిలవటముతో తలెత్తిచూసింది డా. లలితాదేవి.

'చెప్పు మంజులా!'

మా నాన్నగారికి ప్లాన్డ్ ఫేమిలీమీద గానీ, యీ వేసక్టమీల మీదగాని నమ్మకం లేదు. ఇంత ఆస్తి ఉందికదా. నూరుమంది పిల్లలనైనా పోషించగలను, అంటుంటారు డాక్టర్! ఈ డెలివరిలో అమ్మకు మీరు ఆపరేషను చేసెయ్యకూడదా?'

తల్లికి బిడ్డలు పుట్టకుండా ఆపరేషను చెయ్యమని కూతురు అడుగుతోంది. లలితాదేవి బాధగా చూసింది.

'లేదమ్మా! భార్యకి ఆపరేషను చెయ్యాలంటే భర్త డిక్లరేషన్ తప్పక తీసుకోవాలి'

మంజుల ఒక్కక్షణం ఆలోచించింది.

'డాక్టర్! ఇద్దరులేక ముగ్గురు పిల్లలు చాలు అని ప్రభుత్వ ప్రచారం తీవ్రంగా ఉందికదా. మరి మీరే స్వంతంగా, భార్యాభర్తల ఆలోచనలో ప్రమేయం లేకుండా, మూడో డెలివరీకి వచ్చిన స్త్రీలకి బిడ్డలు కలుగకుండా ఆపరేషన్ చేసెయ్యకూడదా?'

'లేదమ్మా! ప్రతివ్యక్తి తన మంచి చెడ్డలు తనే ఆలోచించుకుని నిర్ణయించుకోవాలి. బలవంతంగా ఏపనీ చెయ్యకూడదు.'

'డాక్టర్! ఇది స్పెషల్ కేస్‌గా మీరు ట్రీట్ చెయ్యకూడదా?'

'ప్రయత్నిస్తానమ్మా నువ్వేం దిగులు పడకు. మీ మదర్‌ని జాగ్రత్తగా చూస్తుండు వస్తా.'

అంటూ డాక్టరోచితమైన చిరునవ్వుతో మంజుల భుజం తట్టి వెళ్ళిపోయింది డాక్టర్ లలితాదేవి.

* * *

ఆరోజున ప్రకాష్ ఫోన్ చేశాడు, 'ఈ దాగుడుమూతలు యింక నేను భరించలేను మంజూ! నేనే వస్తున్నాను. అన్ని విషయాలూ మాట్లాడుకుందాము.' అని. అయినా ఒక నిశ్చయానికి వచ్చిన మంజులలో మార్పులేదు.

ప్రకాష్, మంజుల ప్రాణస్నేహితురాలు విమల అన్నయ్య. చాలా అందగాడు. రెండు కంపెనీలకి ఎడ్వయిజర్‌గా, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నాడు. నిజానికి ప్రకాష్ ప్రక్కన మంజులే తీసి కట్టుగా ఉంటుంది. నిరంతర పనిభారం, తల్లి జబ్బును గురించిన బెంగ ఆమె వయస్సుని పెంచి చూపుతాయి. ఇంటి పరిస్థితులు ఆమెకు అలంకరణమీద మోజూ, ఆసక్తి లేకుండా చేశాయి.

రోజూ రెండుపూటలా చెల్లెళ్ళకు, తమ్ముళ్ళకు, నూనెరాచి చక్కగా తలదువ్వే మంజుల, తనవంతు రాగానే, ఆ సమయంలో కూర తరుగుకోవచ్చునో, బియ్యం కడుక్కోవచ్చునో అనిపించి నూనెరాసి, రాయకా, రెండు నిముషాల్లో జడ బిగించి అల్లేసుకుంటూ వంటగదిలో ప్రవేశిస్తుంది. అశ్రద్ధ వహించటంతో ఆమె వెంట్రుకలు చాలా భాగం ఊడిపోయాయి. నడుం పైకి

సన్నగా తోకలా వేలాడుతుంటుంది, చిన్న జెడ. ఒకప్పుడు తనకు పెద్ద పొడుగాటి జడ ఉండేదని ఆమె అంటే ఎవరూ ఇప్పుడు నమ్మ లేరు కదా హాస్యాస్పదం అవుతుంది కూడా! అసలే చామన చాయ మనిషికావటాన, యీ పని ఒత్తిడి వలన మరీ నల్లబడింది. 'చిన్నప్పుడు నేను లావుగా ఉండేదాన్ని' అని చెప్తే, ఇప్పుడు ఎవరూ నమ్మలేరు. మనిషి అంత పొడగరి కాకున్నా పొట్టి కాదు. సన్నగా ఉన్నందున చాలా పొడుగ్గా ఉన్నట్లుగా కనిపిస్తుంది. అందులో, పొడుక్కి తగ్గ వొళ్ళులేక, వొంగినట్లుగా కనిపిస్తుంది. ఆమె కళ్ళుమాత్రం చాలా కాంతివంతంగా ఉంటాయి. ఆమెలో ఆకర్షణ ఆ నేత్ర ద్వయం; సదా పెదాలపై మెరిసే సన్నని చిరునవ్వు. అంతేకాదు' ఆమె మృదు స్వభావం, మధుర, మితభాషణ అందరికీ ఆమెపట్ల గౌరవం కలిగేలా చేస్తాయి.

ఆమె స్వభావం, ఆ మెత్తని మనస్సు ప్రకాష్‌ని ఎంతగానో ఆకర్షించాయి. అతను మంజులను ప్రేమిస్తున్న విషయాన్ని ప్రకాష్ ఆమె కెన్నిసార్లో చెప్పాడు కూడా. విన్నప్పుడు మంజుల సమాధానంగా చిరునవ్వు నవ్వేది. అంతే. ఆ నవ్వునే అంగీకారంగా తీసుకుని ప్రకాష్ ఆమె కొరకు తరుచు వస్తుండేవాడు. అతని తియ్యని మాటలు; ఆరాధనాపూర్వకంగా వింటూండేది మంజుల. ఆకొద్ది సేపూ తన బాధల్ని మర్చిపోగలిగేది.

* * *

కాలింగ్‌బెల్ ట్రిర్‌మంటూ మోగుతుంటే, మంజుల లేచివెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా విమల! 'రా విమలా! లోపలికిరా. చాలారోజులకి వచ్చావు' ఆనందంగా ఆమెని ఆహ్వానించింది, లోపలి తీసుకు వెళ్ళింది.

'విమలా! ఏమిటలా ఉన్నావు? ఉండు కొంచెం కాఫీ తెస్తాను. చాలా అలసటగా కన్పిస్తున్నావు' అంటూ మంజుల, విమలను తన గదిలో కూర్చోబెట్టి వంట గదిలోకి వెళ్ళింది.

విమల ఉస్సురంటూ కూర్చుంది. ఫ్యాన్ గాలికి కర్టెన్ కదులుతోంది. 'ఏమిటిది' మంజులకి బాధే లేదా? ఎందుకిలా చేసింది! ఎందుకు?' అనుకుంటూ అశాంతిగా సోఫాలోనుండి లేచి గదిలోనే పచార్లు చేస్తోంది. పదినిముషాలు గడిచాయి. ఒక ట్రే తీసుకుని మంజుల లోపలికి వచ్చింది. బిస్కెట్లు, వేడివేడి కాఫీ విమల కందించింది. తనూ ఒకకప్పు కాఫీ తీసుకుని త్రాగుతూ, విమలకి బిస్కెట్లు యిచ్చింది. ఒక పావుగంట గడిచింది. విమల మంజుల చేతిని తన చేతిలోకి తీసుకుంటూ ఆమె కన్నులలోనికి చూసింది. బరువుగా నిట్టూర్చింది.

'మంజూ! ఇది నిజమేనా?'

'ఏది, నిజమేనా అని అడుగుతున్నావో నాకు తెలియటంలేదు' పళ్ళ బిగువున ఎలాగో జవాబిచ్చింది.

'మంజూ! నిజంగా నీకు తెలియకే అడుగుతున్నావా?' పోన్లే, చెప్తున్నాను. విను. నా ప్రాణస్నేహితురాలివి, నువ్వు, నీవే నా వదిన వవుతావని చాలా ఆనందించాను. అన్నయ్య నిన్నే ప్రేమిస్తున్నాడని తెలిసిన రోజున నీకంటే ఎక్కువగా ఆనందించాను, నేను నీవు మాయింటికి వచ్చినా, అన్నయ్య, నేను యిక్కడికి వచ్చినా, మీరు ఏకాంతంగా మాట్లాడు కునేందుకు వీలుకలుగ జేసేదాన్ని.'

'నిజమే' నెమ్మదిగా అంది మంజుల, తనలోతాను అనుకుంటున్నంత మెల్లిగా.

'ఇన్నాళ్ళ నా స్నేహితురాలుగా మా యింటి కొస్తే యిక నావదినెగా మా యింట్లోనే ఉంటావని సంతోషపడ్డాను. ఎందుకిలా చేశావు? మంజూ! నువ్వు అన్నయ్యనిలా నిరాశ పరుస్తావనుకోలేదు. మా అన్నయ్యకేం తక్కువ? చదువు లేదా? సంస్కారం లేదా? అందంలేదా? హోదాలేదా? గుణంలేదా? ఏం తక్కువని......'

ఉద్వేగాన్ని అణచుకోలేక మాట ఆపేసింది విమల.


'విమ్మీ!' మంజుల పేలవంగా నవ్వింది.

'అవేమీ కారణాలుకావు. ప్రకాష్ అందానికి నేనే అతనిప్రక్క నిల్చుందుకైనా తగను. ఐనా అతనిలో నాకేలోపమూ కనిపించలేదు.'

'మంజూ! అన్నయ్య నువ్వుకూడా తనని ఎంతో ప్రేమిస్తున్నావని చెప్తుండేవాడు. ఒకవేళ, వాడే పొరబాటు పడ్డాడంటావా? నీ చనువు వుపార్థం చేసుకున్నాడా?'

'విమలా! ప్రకాష్ వాతోకూడా ఎన్నోసార్లు తన ప్రేమని వ్యక్తం చేశారు. కానీ...కానీ నీకు వదిన అయ్యేందుకు ఎంత అదృష్టం ఉండాలి, నాకు?'

'మంజూ! నిజం చెప్పు. ప్లీజ్! అన్నయ్య ఏమిటో తనరూంనుండి బయటకే రావటంలేదు. నాతోకూడా సరిగ్గా మాట్లాడటం లేదు. మంజులా! నిజంగా అన్నయ్యంటే నీ కెలాంటి భావంలేదా? నీ ప్రాణ స్నేహితురాల్ని కాదా, నేను?



కాలో చెప్పకూడదా ? మంజూ !'

ఆ స్వరంలోని ఆర్ద్రత మంజులని నిలువనీయలేదు. 'విమలా' అంటూ విమల భుజాలమీద వాలిపోయింది. ఆమె కన్నీళ్లు విమలపైటని తడిపేస్తున్నాయి. విమల గాబరాగా చూస్తూ 'మంజూ, మంజూ' అని పిలిచింది. 'ఏమిటిది మంజులా ! ఏడుస్తున్నావా? ఎందుకు ? ఏం జరిగింది ? ఊరుకో' అంటూ ఆమె కన్నీళ్లు తుడుస్తోంది. కొంచెంసేపు యిద్దరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు మంజుల ఏడుపు వాపుకుని, నెమ్మదిగా మనస్సు చిక్కబట్టుకుంది.

'విమలా! ప్రకాష్ అంటే నాకు చాలా .........ఓహ్ ! ఎలా చెప్పను ? విమలా! అతని తియ్యని మాటలువింటూ రోజుల్ని క్షణాల్లాగా గడిపేయాలనిపిస్తుంది. అతని ప్రేమవాహినిలో కొట్టుకుపోవాలనిపిస్తుంది. అతను ఏమడిగినా కాదు లేదు అనకూడదనిపిస్తుంది. కాని...కాని ...' అంటూ ఆగిపోయింది.

'కానీ...అయితే...ఏమిటి...'

విమల ఆత్రంగా అడిగింది.

'విమలా! మాయింటి పరిస్థితులు నీకు బాగా తెలుసుకదా. అమ్మకి పిచ్చెక్కాక మా అక్కయ్యలు మాయింటికి రావటం మానుకున్నారు. ఉత్తరాలు...నెలకి ఒకటి కూడా సరిగ్గా రాయరు. ప్రతిపండుగకు మా నాన్నగారు వాళ్ళకి బహుమతులు పంపిస్తూంటారు. అవి చేరినట్లుగా మాత్రం రాస్తారు. అన్నయ్యలంతే. పెద్దన్నయ్య ఇక్కడ ఉండలేక అత్తారింటికి వెళ్ళాడు. చిన్నన్నయ్య బొంబాయి వెళ్ళి, మామగారితో కలిసి బిజినెస్ చేస్తున్నాడు. శ్యామలకూడా తన పరీక్షలు కాగానే చిన్నన్నయ్య దగ్గరికి వెళ్ళిపోయింది. గీతకి

# పరిష్కారం

కూడా మా శ్యామల పిచ్చులన్నీ బాగా అంటాయి, అదీ అక్కడికే వెళ్తానని గోల చేస్తోంది. నెక్స్ట్ యియర్ యిదీ వెళ్తుందేమో. మా అన్నయ్యలకి మొదటి నుండి నాన్న గారంటే పడదు. మా వదినలు చాలా సోషల్‌లేడిస్. తమ పిల్లల్ని చూసుకునేందుకుకూడా యిష్టం, తీరిక ఉండదు వాళ్ళకి.

చిన్నబాబు, రమేష్ బాగా చదువుతాడు. 'అమ్మని మెంటల్ హాస్పిటల్‌లో చేరిస్తే త్వరగా నయం అవుతుందేమో కదక్కా' అంటాడు చిన్నబాబు. కానీ, నేనేం చెప్పగలను? విమలా! నాన్నగారికి యిష్టం లేదు. పెద్దన్నయ్య మొదట్లోనే వేరుగా వెళ్ళిపోయాడు చిన్నన్నయ్య పెళ్లిఅంటే నేనెంతో సంతోషించానో. ఆ రోజున వదిన వస్తుంది. నా బాధ్యతలు తీరుతాయి అని. ఆ సంవత్సరమే అమ్మకి బాగా ఎక్కువైంది. రాణి నెలపిల్ల. వంటవాళ్ళు సరిగ్గా కుదరడంలేదు. అప్పుడు అన్నయ్య ఏమీ పట్టించుకోకుండా పెళ్లికాగానే బొంబాయికి వెళ్లిపోయాడు. ఆసంవత్సరం బి.ఏ.లో చేరికూడా మానేశాను. ఆ తర్వాతి ఏడాది మళ్లీచేరాను.

వీళ్ళు ముగ్గురూ యింకా చిన్నపిల్లలు విమలా. అందులో మా అమ్మకి మళ్లీ... నేనుకూడా వెళ్లిపోతే నా తమ్ముళ్ళని, చెల్లెళ్ళని, అమ్మని ఎవరు చూస్తారు విమలా ?'

ఆశ్చర్యంగా వింటున్న విమల చప్పున అందుకుని 'అందుకని నీ భవిష్యత్తునే నాశనం చేసుకుంటావా మంజులా' అనడిగింది.

'విమలా! నావాళ్లకోసం నేనీమాత్రం చెయ్యలేనంత త్యాగం ఏమీలేదు. నా భవిష్యత్తు నాశనంకూడా కాదు. వీళ్ల అభివృద్ధిలోనే ఆనందం వెతుక్కుంటాను.'

'.........................'

'విమలా ! అందుకే ఇప్పట్లో నా పెళ్లిగురించి ఆలోచనే లేదు. ప్రకాష్‌పట్ల నాకుగల అనురాగాన్ని నీకెలా చెప్పగలను? విమలా ! ఈ బాధ్యతలే నామీద లేకపోతే, ఆనందంతో అతని అనురాగ ప్రవంతిలో ఆనంద నాట్యాలు చేసేదాన్ని. కానీ ... నాకా అదృష్టంలేదు. విమలా !'

'అయితే పెళ్ళేచేసుకోవా ? మంజూ!'

'ఎందుకు చేసుకోను ? నా బాధ్యతలన్నింటిని సక్రమంగా నిర్వహించుకున్నాక తప్పక పెళ్లి చేసుకుంటాను.'

'అప్పటికి నీ వయస్సు ఎంత ఉంటుందంటావు, మంజులా' నవ్వుతూ ప్రశ్నించింది విమల.

'మరొక పదిహేను — లేదా— ఇరవై ఏళ్ళు రావచ్చును.'

'మంజూ ! నీ త్యాగబుద్ధికి నిన్ను అభినందించాలా? నీ జీవితం నాశనం అయిపోతోందని విచారించాలా? నాకేమీ పాలుపోవటం లేదు. మంజూ ఒక్కటిమాత్రం చెప్పగలను. నువ్వు చాలా గొప్పదానివి.' ఆమెని ఆరాధనగా చూస్తూ అంది విమల.

'విమలా' మంజుల చూపుల్లో గాంభీర్యం కనిపిస్తోంది. వింత కాంతులీనే ఆ కన్నుల్లోని ఆరని తడి ఆమె బాధని చెప్పక చెప్తోంది.

'నా ఎదుట ఒక సమస్య నా కోసం ఉంది. నేను దానిని నాకు తోచినరీతిలో, నాకు చేతనయిన విధాన, పరిష్కరించుకున్నాను. ఇంత మాత్రానికి నన్ను అభినందించటమో, నీవు విచారించటమో ఎందుకు చెప్పు ? విమలా ! నీవు ఎప్పటిలా నాతో స్నేహంగా ఉంటే నాకదే పదివేలు. నా పరిష్కారం వలన వచ్చే కష్టాలో, నష్టాలో, సుఖాలో, సంతోషాలో, మనస్ఫూర్తిగా నేను అనుభవిస్తాను. దీనికి మరెవ్వరిని బాధ్యులని చెయ్యను.'

ఆమె చిరునవ్వులో తన పరిష్కారం పట్ల సంతృప్తి, నమ్మకం, ఆత్మవిశ్వాసం అచంచల ధైర్యం గోచరించాయి విమలకు.

